క్లుప్తంగా

అట్టహాసంగా ద్రౌపదీదేవి ఊరేగింపు



ద్రౌపదీ సమేత పాండవుల ప్రతిమలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

పాకాల : మండలంలోని మొగరాల భారతం మిట్టలో ఈ నెల 29వ తేదీ నుంచి జరగనున్న 49వ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆదివారం కొత్తరామాపురం, పెద్దహరిజనవాడ, కృష్ణాపురం, కృష్ణాపురం దళితవాడ, నేలదానిపల్లి, పచ్చిపాలపల్లి, దళితవాడ, గొల్లవానివంక గ్రామాల మీదుగా ఈ విగ్రహాలను ఊరేగించారు. గ్రామంలోకి వచ్చిన ఉత్సవమూర్తులకు స్థానికులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. మొగరాల చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 4 రోజుల పాటు విగ్రహాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అంబరం.. సాంస్కృతిక సంబరం



నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోరూర్ చెన్నైకి చెందిన శ్రీహర్షిక నృత్యాలయ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు యోగంబల్, సతీష్ కుమార్ పర్యవేక్షణలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, మహాగణపతిం, ఏకదంతాయ, బొమ్మ బొమ్మతా, అలరిప్పు, అలైపాయుతే, బోశంభో వంటి పాటలకు కళాకారులు హర్షిక, లియా, అస్మిత, సంయుత చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు. ప్రేక్షకులు కరతాళధ్వనులతో వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఏట సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్: జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కళ్లిచెట్టు గ్రామం వద్ద కల్కి ట్రస్ట్ వారు ఆక్రమించిన 21 ఎకరాల అంజూర్ అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్కి ట్రస్ట్ ఆక్రమించిన అటవీ భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్య వైఖరి చూపుతున్నారని ప్రశ్నించారు. ట్రస్ట్ నిర్వాహకులు అటవీ భూముల్లో పెద్దపెద్ద కట్టడాలు నిర్మించి యజ్ఞాలు, యాగాలు, భజనలు చేస్తూ విదేశీయులను రప్పించి అడవిని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు నిద్రావస్థలో ఉండడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని కల్కి ఆక్రమించిన అటవీ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ మహిళా పార్టీ వ్యవస్థాపకురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

మోదీ మౌనం దేశానికి హానికరం



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వర్లు

తిరుపతి కల్చరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై మోదీ మౌనం వహిస్తే దేశానికే హానికరమని.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే విధంగా విధించిన సుంకాలపై తక్షణం ప్రధాని స్పందించాలని సీపీఎం రాష్ట్ర నేతలు వి.వెంకటేశ్వర్లు, మూలం రమేష్ డిమాండ్ చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు స్టీల్ ఫ్యాక్టరీని పరిరక్షిస్తామని కూటమి నేతలు చెబుతూనే నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తున్నారని విమర్శించారు. కార్మికుల తొలగింపుపై కూటమి నేతలు ఎందుకు స్పందించరని వారు ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి పథకాన్ని ఏడాదికి 200 రోజులకు పొడిగించాలని, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ శ్రీసిటీలో బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి, నాయకులరు టి.సుబ్రమణ్యం, అంగేరి పుల్లయ్య పాల్గొన్నారు.

పార్టీలో చేర్చుకొని వ్యక్తిత్వాన్ని చంపేసిన నాని

- ఇంటి దొంగలను పట్టించినందుకు ఎమ్మెల్యే నానికి థ్యాంక్స్
- టీడీపీలోకి వెళ్లిన వారిపై రాజకీయ వ్యభిచారులుగా ముద్ర
- నాని మాటలతో తలెత్తుకోలేకున్న నేతలు
- వైఎస్సార్‌సీపీలో ఇంకా ఎవరైనా కోవర్టులు ఉంటే త్వరగా తీసుకెళ్లండి
- మీడియా సమావేశంలో తిరుపతి రూరల్ వైఎస్సార్‌సీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి రూరల్ : 'ఎమ్మెల్యే నానీ.. మా వైఎస్సార్‌సీపీలోని ఇంటి దొంగలను పట్టించినందుకు మీకు కృతజ్ఞతలు.. మా పార్టీలో నమ్మకంగా తిరుగుతూ గత ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా చంద్రగిరి నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని నిలువునా మోసం చేసిన ఇంటి దొంగల గుట్టును రట్టు చేశారు.. అసెంబ్లీలో అడుగు పెట్టాల్సిన పిల్లోడు పంచన చేరి ప్రత్యర్థి గెలుపునకు కృషి చేసిన వారి వివరాలు బహిరంగంగా బయటకు చెప్పి మాకు మంచి చేశారు.. అందుకే మీకు కృతజ్ఞతలు చెబుతున్నాం. మా పార్టీలోనే ఉంటూ మీ విజయానికి పనిచేసిన వారిలో ఇంకా ఎవరైనా ఉంటే అలాంటి వారిని కూడా వీలైనంత త్వరగా మీ వెంట తీసుకుని వెళ్లండి..' అంటూ తిరుపతి రూరల్ మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పాకాల, తిరుపతి రూరల్ మండలాల నుంచి కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరారని, వారిని పార్టీలోకి చేర్చుకునే సమయంలో ఎమ్మెల్యే నాని బహిరంగ వేదికపై మాట్లాడుతూ టీడీపీలోకి వీరిని చేర్చుకోవడానికి ముఖ్యకారణం గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో నమ్మకస్తులుగా ఉంటూనే టీడీపీ గెలుపునకు సహకరించారని..అందుకే చేర్చుకుంటున్నాం అని ప్రజలందరికీ తెలిసేలా మీడియా సమక్షంలో చెప్పి తమకు మంచి చేశారన్నారు. నాని మాటలను మీడియా ద్వారా చూసిన తామంతా ఉలిక్కిపడ్డామని, తమ పార్టీలోనే ఉంటూ నమ్మక ద్రోహులుగా, నీతిలేని నాయకులుగా తిరిగిన వారి గుట్టును రట్టు చేసిన నానికి థ్యాంక్స్ అన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీలో ఇంకా ఎవరైనా అలాంటి కోవర్టులు ఉంటే వీలైనంత త్వరగా టీడీపీలో చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నానికి రుణపడి ఉంటాం

అనంతరం పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముసుగు వేసుకుని తన గెలుపునకు పనిచేసిన వారి వివరాలు బయటపెట్టిన ఎమ్మెల్యే నానికి రుణపడి ఉంటామన్నారు. ఎవరైనా ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి చేరేటప్పుడు ఆ చేర్చుకొనే వ్యక్తి నిన్నటి వరకు వీరంతా ఒక పార్టీలో నమ్మకంగా పనిచేశారు, ఆ పార్టీ కోసం కష్టపడ్డారు, ఇప్పుడు మన పార్టీ సిద్ధాంతాలు నచ్చివస్తున్నారని సహజంగా చెప్పాల్సిన మాట.. కానీ అలా కాకుండా.. అప్పటి వరకు ఉన్న పార్టీకి నమ్మక ద్రోహం చేసి, వెన్నుపోటు పొడిచి కోవర్టులుగా పనిచేశారని చెబుతూ పార్టీలోకి చేర్చుకుంటున్నామని బహిరంగంగా చెబితే ఆయనను నమ్మి ఆ పార్టీలోకి వెళ్లిన వారి రాజకీయ జీవితాలకు సమాధి కట్టినట్టే కదా..? అన్నారు. ఎమ్మెల్యేగా నాని బహిరంగ వేదికపై నుంచి మాట్లాడిన మాటలకు నానిని నమ్ముకుని టీడీపీలోకి వెళ్లిన వారు పల్లెల్లో తలెత్తుకు తిరగలేని పరిస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, చిగురువాడ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు ధరణీ కుమార్ రెడ్డి, సర్పంచ్ కోటేశ్వరరావు, గాంధీపురం మన్నూరు శివ, దేవ రాజులు తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
- నారాయణపురంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిరసన సభ
- సీపీఎల్ క్రికెట్ సీజన్1 ప్రీలియం లీగ్ మ్యాచ్‌లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు క్రికెట్ మ్యాచ్ నిర్వహణ

వైభవంగా రథోత్సవం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న రంగనాథస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం జరిగిన రథోత్సవం గోవింద నామస్మరణల నడుమ అట్టహాసంగా జరిగింది. బ్రహ్మరథంపై స్వామి, అమ్మవార్లు కొలువుదీరగా భక్తులు రథాన్ని లాగారు. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల నియామకం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గారి సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

గ్రామ కమిటీ అధ్యక్షులు వీరే..

వైఎస్సార్‌సీపీ తిరుమలనగర్ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేష్ మొదిలియార్, మంగళం-రమేష్, సప్తగిరి కాలనీ- మహమ్మద్ ఖాసీం, రణధీరపురం-రజాక్, న్యూమంగళం -భాస్కర్ రెడ్డి, తిరుచానూరు- సునీల్, ముండ్లపూడి-కుప్పిరెడ్డి, పాడిపేట-ఈశ్వర్‌రెడ్డి, బ్రాహ్మణపట్టు- ఢిల్లీ ప్రసాద్, పాతూరు -ఢిల్లీబాబు, కొత్తూరు-బోయన కేశవులు, వేమూరు-తేజ, పానకం -తిమ్మారెడ్డి, పద్మావతిపురం- సంతోష్‌కుమార్ రెడ్డి, ఓటేరు-రాజ, శ్రీనివాసపురం-సురేష్ ఆకపాటి, తనపల్లి-జె.విజయసింహారెడ్డి, కుంట్రపాకం -అవినాష్ రెడ్డి, వేదాంతపురం-వడివేలు, చిగురువాడ -ధరణీకుమార్ రెడ్డి, కేసీపేట- నరేంద్ర, దుర్గసముద్రం - జ్యోతి, సి.మల్లవరం- సిద్ధారెడ్డి, పెరుమాళ్లపల్లి-వెంకటనారాయణరెడ్డి, పుదిపట్ల-కె.లక్ష్మయ్య యాదవ్, చెర్లోపల్లి-దొరస్వామి, పేరూరు 1 - శశి ముదిరాజ్, పేరూరు 2 - డి.సిద్ధయ్య, పేరూరు 3- సి.ప్రసాద్, వెంకటపతినగర్ - శ్రీనివాసులు, తుమ్మలగుంట - తంబిరెడ్డి, పాతకాల్వ - అరుణ్‌కుమార్ రెడ్డి, మల్లంగుంట - జయచంద్రారెడ్డి, రామానుజపల్లి - టి.సోమశేఖర్‌రెడ్డి, సి.గొల్లపల్లి - బాలసుబ్రమణ్యం రెడ్డి, పైడిపల్లి - అమరనాథరెడ్డి, అవిలాల - శ్రీను, గాంధీపురం - గురవారెడ్డి, సాయినగర్ - సోమశేఖర్ రెడ్డి, లింగేశ్వరనగర్ - రవిని నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది.

దేశభక్తి ఉట్టిపడేలా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ చేస్తున్న రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజలు

తిరుపతి కల్చరల్: ఆపరేషన్ సింధూర్ విజయవంతం నేపథ్యంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు సాగిన ఈ ర్యాలీలో త్రివర్ణ పతాకాలు చేతపట్టి భారత సైనికుల వీరత్వానికి జేజేలు పలికారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి దేవరాజులు, సేవా కుటుంబం ప్రతినిధి శ్రీదేవి, సరళ, కార్గిల్ యుద్ధవీరులు మాజీ సైనికుడు ఏపీ నాయుడు, గుర్రప్ప, మార్పు సేవా సంస్థ దళవాయి గుర్రప్ప, ఉపాధ్యాయులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా సోమ వారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208 నంబర్‌కు చేసి చెప్పవచ్చన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోవిందా.. ఏమిటీ దందా..!



శ్రీవారిమెట్టు వద్ద టోకన్ల కోసం భారీగా క్యూ కట్టిన భక్తులు

- శ్రీవారిమెట్టు వద్ద భక్తుల నిలువుదోపిడీ
- ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు హల్‌చల్

చంద్రగిరి: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల దందాను పూర్తిగా అరికడతామని టీటీడీ అధికారుల ప్రకటనలు కేవలం పేపర్లకే పరిమితవుతున్నాయి. శ్రీవారిమెట్టు వద్ద నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులను ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల టార్గెట్ చేస్తూ నిలువ దోపిడీకి పాల్పడుతున్నారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో ఆదివారం ఉదయం శ్రీవారిమెట్టుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆటోలు, జీపు డ్రైవర్లు టైమ్ స్లాట్ టోకెన్లు తీయిస్తామంటూ భక్తుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడ్డారు. ఈ దందా తరచూ జరుగుతున్న శని, ఆదివారాల్లో మరింత ఎక్కువ అవుతోంది. శ్రీవారిమెట్టు మార్గం చేరుకోవాలంటే శ్రీనివాసమంగాపురం దగ్గర ఉదయం 6 గంటలకు అనుమతిస్తారు. రాత్రి నుంచే ఆటోలు, జీపులు ఒకదాని వెంట ఒకటి భారీగా క్యూ కట్టడంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకొస్తున్నారు. గేట్లు తెరవగానే టీటీడీ సెక్యూరిటీ వారికి ప్రాధాన్యత ఇస్తూ ముందుగా వదులుతున్నారని పలువురు భక్తులు మండిపడుతున్నారు. దీంతో బారికేడ్లు తోసుకుని భక్తులు ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సెక్యూరిటీ సిబ్బంది తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెక్యూరిటీపై విమర్శలు తగదు

తిరుమల: నిన్నటిరోజు టోకెన్ ఉన్న 5000 మంది భక్తులతో పాటు, టోకెన్ లేని సుమారు 7000 మంది భక్తులు శ్రీవారి మెట్టు మార్గం ద్వారా తిరుమల చేరుకోవడం వల్ల టోకెన్ సెంటర్ పరిసరాల్లో తీవ్ర వాహన రద్దీ, అధిక రద్దీ ఏర్పడింది. అందుకే ఆదివారం రద్దీ నియంత్రణను మరింత పటిష్ఠంగా అమలు చేశారు. పంపుహౌస్ వద్ద, ఓల్డ్ మయూరి డెయిరీ ముందు, రైల్వే అండర్ బ్రిడ్జి మొత్తం మూడు కట్-ఆఫ్ పాయింట్లను ఏర్పాటు చేసి, వాహనాలను దశలవారీగా నిలిపి, టోకెన్లకు అనుగుణంగా పంపించడం జరిగింది. అయితే కొంతమంది భక్తులు తాము నడచి వెళ్తామని అడగడంతో.. వారిని విజిలెన్స్ సిబ్బంది పంపించారు. అయితే కొందరు వ్యక్తులు వాటిని వీడియోలు తీసి విజిలెన్స్ సిబ్బంది అడ్డదారిలో టోకెన్ కౌంటర్ల వద్దకు పంపుతున్నారని ప్రచారం చేశారు. ఇది పూర్తిగా అవాస్తవమని టీటీడీ ఓ ప్రకటనలో తెలియజేసింది.

మాతమ్మ గుడికి విరాళం



విరాళం అందిస్తున్న సర్పంచ్

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీలోని బాధూర్ వీధిలో కొలువైన మాతమ్మ గుడికి రూ.17 వేలు విరాళం అందించారు. ఆదివారం మాతమ్మ కొలువు సందర్భంగా గ్రామ సర్పంచ్ ముసుకు కోటేశ్వర రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయానికి విరాళ నగదును అందించారు.

తేనె తుట్టె.. తొలగిస్తే ఒట్టు..!



కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం వద్ద పైభాగంలో స్లాబ్‌కు ఉన్న తేనెతుట్టె

తిరుపతి అర్బన్: జిల్లా కేంద్రమైన తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయానికి సోమవారం వస్తే చాలు తేనెటీగల టెన్షన్ తప్పడం లేదు. 40 రోజులుగా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన ద్వారం వద్ద స్లాబ్‌కు పెద్ద తేనేటీగల తుట్టె ఉంది. ఏమాత్రం కదిలించినా.. అంతే సంగతులు.. పెద్దతేనెటీగలు దాడి చేస్తే ఏంటి పరిస్థితి అని కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి మదిలో భయం? ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలు సమస్యలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా అర్జీదారులు వస్తుంటారు. వారిలో దివ్యాంగులు, వృద్ధులు, పిల్లలు ఉంటారు. ఒకవేళ తేనెటీగల పుట్టలో కదలిక వస్తే వీరి పరిస్థితి ఏంటని ఆలోచిస్తేనే భయం కలుగుతోంది. అయితే అధికారులు తేనెటీగల తుట్టెను రోజూ చూసి వెళ్తూ లైట్ తీసుకుంటున్నారు.



- భక్తులారా భద్రం..

తిరుమల శ్రీవారి దర్శనానికి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులు రుయా ఆస్పత్రి రోడ్డులోని అలిపిరి వద్దకు చేరుకుంటారు. ఈ మార్గంలోనే భక్తులు లగేజీలను డిపాజిట్ చేసి తిరుమలకు వెళ్తారు. ఈ క్రమంలో రుయా ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడుబండ్ల వారి వద్ద నుంచి టిఫిన్ ప్లేటు తీసుకుని కొందరు భక్తులు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కూర్చుని తింటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో అనుకోని ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి ? - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సీపీఎల్‌లో అదరగొడుతున్న క్రికెటర్లు





మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న దినేష్ వర్మ, అభిషేక్ రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) క్రికెట్ పోటీల్లో ఆటగాళ్లు అదరగొడుతున్నారు. రంజీ, ఏపీ, జాతీయ స్థాయి క్రికెటర్లు సీపీఎల్‌లో తమ సత్తా చాటుతున్నారు.

4 వికెట్ల తేడాతో స్పార్టన్ వారియర్స్ గెలుపు

ఆదివారం ఉదయం రాయల్ చాలెంజ్ తిరుచానూరు, స్పార్టన్ వారియర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. షేక్ ఫయాజ్ అలీ 30 బంతుల్లో 4 సిక్సులు, 3 ఫోర్లతో 57 పరుగులు చేశాడు. అనంతరం 169 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన స్పార్టన్ వారియర్స్ జట్టు 18.2 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 170 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ దినేష్ వర్మ 42 బంతుల్లో 3 సిక్సర్లు, 9 ఫోర్లతో 80 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి విజయకుమార్, వేణుగోపాల్ నాయుడు, దివాకర్‌రెడ్డి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

48 పరుగుల తేడాతో ఆదిత్య జట్టు విజయం

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో పాయ్ వైస్రాయ్ జట్టుపై ఆదిత్య జట్టు 48పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. ఓపెనింగ్‌కు దిగిన అభిషేక్ రెడ్డి 56 బంతుల్లో 97, కల్యాన్ 26 బంతుల్లో 47పరుగులు సాధించారు. అనంతరం పాయ్ వైస్రాయ్ జట్టు 18.1 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అభిషేక్ రెడ్డి నిలిచాడు.

పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన రేపు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం మహతి కళాక్షేత్రంలో పౌరాణిక, సాంఘిక నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ప్రకాశం రోడ్డులోని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న నాటక కళల పట్ల ప్రజల్లో మరింత ఆదరణ కల్పించి, వాటికి పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో తమ సంస్థ ప్రతి నెల నాటక ప్రదర్శ చేపడుతోందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో ఉచితంగా అనేక నాటకాలను ప్రదర్శించామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు మహతిలో 'తరమెళ్లిపోతోంది' అనే అద్భుతమైన కుటుంబ వ్యవస్థ, రక్తసంబంధాలు విశిష్టతను ఆవిష్కరించేలా సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గొప్ప పౌరాణిక పద్యనాటకం 'లవకుశ' నాటక ప్రదర్శన ఉంటుందని, ప్రజలు, కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ప్రతినిధులు గోపాల్ రావు, మల్లికార్జున పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

కాణిపాకం చక్రవర్తి, B.Com., B.L.
ఎ.నుఫులన్, M.B.A., LLB(HonS)
న్యాయవాదులు, డోర్ నెం.20-7-48/2, ఓం అపార్ట్‌మెంట్ డి.బి.ఆర్.హాస్పిటల్ రోడ్డు, కొర్లగుంట, తిరుపతి- 517501, సెల్: 98856 55322, 8341 585858